క్లుప్తంగా

హాస్టళ్లలో మౌలిక వసతులను మెరుగుపరచాలి

• కొత్తవలస కోర్టు జడ్జి విజయ్‌చంద్ర



పోలీస్‌స్టేషన్ సమీపంలోని వసతి గృహాన్ని పరిశీలిస్తున్న జడ్జి విజయ్‌చంద్ర

కొత్తవలస: ప్రభుత్వ వసతి గృహాల్లో మౌలిక వసతులను మరింత మెరుగుపరచాలని కొత్తవలస జూనియర్ సివిల్ కోర్టు జడ్జి డాక్టర్ ఎస్.విజయ్‌చంద్ర అన్నారు. మండల కేంద్రంలోని బీసీ వెల్ఫేర్, సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వసతి గృహాలను మంగళవారం ఆయన సందర్శించారు. వసతి గృహాల్లో మరుగుదొడ్లు, స్నానపు గదులు, వంట గదులు, భోజనశాలలను పరిశీలించారు. పోలీస్‌స్టేషన్ సమీపంలోని సాంఘిక సంక్షేమశాఖ బాలుర వసతి గృహంలో మరమ్మతులను, పరిశీలించి పలు సూచనలు చేశారు.ఆయన వెంట పలువురు న్యాయవాదులు ఉన్నారు.

రైతులకు నాణ్యమైన విత్తనాలు అందజేయాలి



సీడ్ డీలర్స్‌తో సమావేశమైన ఏడీఏ విజయ

కొత్తవలస: ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతోందని రైతులకు నాణ్యమైన విత్తనాలు విక్రయించాలని ప్రైవేట్ డీలర్స్‌కు వ్యవసాయశాఖ ఏడీఏ ఎల్.విజయ సూచించారు. మండల కేంద్రంలోని వ్యవసాయ శాఖ సబ్‌డివిజన్ కార్యాలయంలో వేపాడ, ఎల్.కోట, కొత్తవలస, జామి, ఎస్.కోట మండలాల సీడ్ ప్రైవేట్ డీలర్స్‌తో మంగళవారం సమావేశం నిర్వహించారు.ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విత్తనాలను అందుబాటులో ఉంచాలని, నాసిరకమైన,నకిలీ విత్తనాలను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.అలాగే ప్రతీ డీలర్ స్టాక్ రిజిస్టర్లను పక్కాగా నిర్వహించాలన్నారు. అలాగే బిల్ బుక్‌లు అప్‌డేట్‌లో ఉండాలన్నారు. స్టాక్ బోర్డులో ఎప్పటికప్పుడు స్టాక్ ,ధరల వివరాలను ప్రదర్శించాలని సూచించారు. అయిదు మండలాల ఏఓలు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



ప్రచారం చేస్తున్న త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి సభ్యులు

వేపాడ: మండల కేంద్రంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక విజయరాంపురం కమిటీ అధ్యక్షుడు కె.త్రినాథ రావు ఆధ్వ ర్యంలో త్రైత సిద్ధాంత భగవ ద్గీత, అనుబంధ గ్రంథాలపై మంగళవారం ప్రచారం చేశారు. ప్రబోధ సేవా సమితి సభ్యులు వి.సురేష్, బి.పైడన్న, భవాని, సత్యం మాట్లాడుతూ సర్వ మానవాళికి సంబంధించిన జ్ఞానం భగవద్గీతలో ఉందన్నారు.అందరూ త్రైత సిద్ధాంత ఆధ్యాత్మిక గ్రంథాలను చదివి ఆత్మజ్ఞానాన్ని తెలుసుకోవాలని, శ్రీ కృష్ణ పరమాత్ముడు జగద్గురువు అని అన్నారు.


బ్రిడ్జి పనుల్లో పురోగతి



రాజాం రోడ్డులో బ్రిడ్జి ఏర్పాటు

చీపురుపల్లి: పట్టణంలోని రైల్వే ఓవర్ బ్రిడ్జి పనుల్లో పురోగతి కనిపిస్తోంది. ఎంతోకాలంగా ఎదురు చూస్తున్న ఆర్‌ఓబీ పనుల్లో ప్రధాన బ్రిడ్జి పనులను రైల్వే అధికారులు నిర్వహించారు. ఈ మేరకు రాజాం రోడ్డులో గల రైల్వే ఓవర్ బ్రిడ్జి పనుల్లో భాగంగా మంగళవారం గంట సమయం పాటు హౌరా-చెన్నై లైన్‌లో రైళ్లను నిలుపుదల చేశారు. అనంతరం ఆర్‌ఓబీకి సంబంధించిన బ్రిడ్జి పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆర్‌ఓబీకి సంబంధించి దాదాపు పనులు పూర్తి కావొచ్చాయని స్థానికులు చర్చించుకుంటున్నారు.

రామబాణానికి ప్రత్యేక పూజలు



రామబాణం వద్ద పూజలు చేస్తున్న అర్చకులు

గజపతినగరం: మండల కేంద్రంలో వెలసిన సీతారామ ఆలయంలో కోదండ రాముడి రామబాణానికి భక్తులు పూజలు చేసేందుకు పోటెత్తారు. అయోధ్య శ్రీరాముడి రామబాణాన్ని 13కేజీల వెండి, ఒక కేజీ బంగారంతో హైదరాబాద్‌కు చెందిన శ్రీనివాస శర్మ(సిద్ధాంతి) తయారు చేసి సమర్పించేందుకు సిద్ధం కాగా ఆ బాణాన్ని గజపతినగరంలోని సీతారాముల ఆలయానికి ఆలయ కమిటీ మంగళవారం తీసుకు వచ్చింది. దీంతో రామబాణానికి తిలకించేందుకు భక్తులు తరలిరాగా అర్చకుడు శ్రీనివాసాచార్యులు వారితో ప్రత్యేక పూజలు చేయించారు.

అంతా మాఇష్టం... అడిగేదెవరు..?

• రోడ్లపై అడ్డగోలుగా వాహనాల పార్కింగ్
• రోడ్లపైనే వ్యాపారాలు, లోడింగ్, అన్‌లోడింగ్
• కనిపించని పోలీసింగ్
• అవస్థలు పడుతున్న ప్రజలు



ఎస్.కోటలో ప్రధాన రహదారిలో రోడ్డుపై వాహనాలు నిలిపి అన్‌లోడ్ చేస్తున్న దృశ్యం



దేవి కూడలిలో నడిరోడ్డులో ఆగిఉన్న వాహనం



పుణ్యగిరి రోడ్డులో రెండు వైపులా ఆగి ఉన్న వాహనాలు



దారగంగమ్మ ఆలయం వద్ద రోడ్డుపై వాహనాల పార్కింగ్

శృంగవరపుకోట: ఎస్.కోట పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణ, రోడ్ సేఫ్టీ, పోలీస్ పెట్రోలింగ్ కరువైంది. దీంతో వాహన చోదకులు అడిగేదెవడ్రా... అడ్డేదెవడ్రా అంతా మాఇష్టం అన్న తీరుగా ఎక్కడ పడితే అక్కడే వాహనాలను నిలిపేసి నిదానంగా తమపనులు చేసుకుంటున్నారు. దీంతో సామాన్య జనం నిత్యం నరకం చూస్తున్నారు. ఎస్.కోట పట్టణంలో ఎక్కడైనా ఎప్పుడైనా అది నడిరోడ్డు అయినా, నాలుగు రోడ్ల కూడలైనా వాహనాలు నిరభ్యంతరంగా ఆపేయవచ్చు అన్న చందంగా ఉంది పరిస్థితి. ఎక్కడ ఎంత సేపు ఆపినా, లోడింగ్, అన్‌లోడింగ్ చేసినా అడిగే నాథులే లేరు. పోలీసులు పట్టించుకోకపోవడంతో ఇష్టారాజ్యంగా లారీలు, వ్యాన్‌లు, ఆటోలు, లగేజ్ వాహనాలు, గూడ్స్ వెహికల్స్ ప్రధాన రహదారిలో, వీధి రోడ్లలో గంటల పాటూ నిలిపేసి లోడింగ్, అన్‌లోడింగ్ చేసుకుంటున్నారు. పట్టణంలో రోడ్లు ఉన్నది వాహనాల పార్కింగ్, అడ్డగోలు వ్యాపారాల కోసమే అన్నది నిష్ఠూర సత్యం. టూ వీలర్లు, తోపుడుబళ్లు, ఆటోలు వ్యాన్‌లు, లారీలు, టూరిస్ట్ వెహికల్స్, ఆర్టీసీ బస్సుల వరకూ అన్నీ రోడ్డుపైనే పార్క్ చేస్తారు. వీరికి తోడుగా కూరగాయలు, పండ్లు కోళ్లు, పూసలు ఇలా అన్ని వ్యాపారాలకు కేరాఫ్ రోడ్డే.

పట్టని ప్రజల అవస్థలు

ఫ్రెండ్లీ పోలీసింగ్ చేస్తున్న పోలీసులు ఫ్రెండ్‌షిప్ పేరుతో చూసీచూడనట్టు వదిలేశారు. పెట్రోలింగ్ ఊసు మరిచిపోయారు. దీంతో అడ్డగోలు పార్కింగ్‌లు, అక్రమ వ్యాపారాలు, రోడ్లపై మందుబాబుల చిందులు, ట్రిపుల్ రైడర్ల విన్యాసాలతో పట్టణవాసులు బెంబేలెత్తిపోతున్నారు. ప్రధానంగా బైక్‌లపై దూసుకుపోతున్న యువత, బైక్‌రైడ్‌లపై బెట్టింగ్ బ్యాచ్‌లను, గుట్టు చప్పుడు కాకుండా గంజాయి అమ్మకాలు సాగిస్తున్న వారిపై ఉక్కు పాదం మోపాల్సిన అవసరం ఉంది. హోటళ్లు, కల్యాణ మండపాలు, వ్యాపార సముదాయాల వారు పార్కింగ్ ఏర్పాటు చేసుకునేలా, ఆటోలు అడ్డగోలుగా రోడ్లపై నిలిపేయకుండా చర్యలు తీసుకోవాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

కష్టపడేవారికి గుర్తింపు



మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్యను కలిసిన వలిరెడ్డి శ్రీనివాస్. తదితరులు

• మాజీ ఎమ్మెల్యే బొత్సను కలిసిన ప్రచార విభాగం అధ్యక్షుడు వలిరెడ్డి

గజపతినగరం రూరల్: పార్టీ కోసం కష్టపడే ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు ఉంటుందని వైఎస్సార్‌సీపీ జిల్లా అనుబంధ, ప్రచార విభాగాల అధ్యక్షుడు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు అన్నారు. గజపతినగరంలోని పార్టీ మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్యను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలోని పలు విభాగాల్లో నిష్ణాతులైన కార్యకర్తలను నాయకులుగా, అధ్యక్షులుగా నియమించడం సంతోషదాయకమన్నారు. పార్టీని వార్డు నుంచి నియోజకవర్గ స్థాయి వరకు మరింత బలోపేతం చేసేందుకు అహర్నిశలు కృషి చేస్తానని తెలిపారు. తనపై నమ్మకం ఉంచి పార్టీ ప్రచార విభాగం బాధ్యతలను అప్పగించిన జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. బొత్స అప్పలనరసయ్య మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంపై ప్రజలకు నమ్మకం పోయిందన్నారు. గ్రామాల్లో ఎక్కడ చూసినా జగనన్న చేసిన అభివృద్ధి ఫలాలపైనే చర్చసాగుతోందన్నారు. గ్రామ స్థాయి నుంచి క్యాడర్‌ను మరింత బలపడేలా చేయాల్సిన బాధ్యత నూతన కమిటీలపై ఉందని గుర్తుచేశారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు బూడి వెంకటరావు, యువ నాయకులు మండల సురేష్, బెల్లాన త్రినాథరావు, ఆయా విభాగం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ టోర్నమెంట్ ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ చైర్మన్ రఘురాజు

శృంగవరపుకోట: కేంబ్రిడ్జ్ నారాయణ పాఠశాలలో గత 27 రోజులుగా కొనసాగుతున్న వేసవి బ్యాడ్మింటన్ శిక్షణ శిబిరంలో చీఫ్ కోచ్ డాక్టర్ పాట్నూరు శ్రీరాములు ఆధ్వర్యంలో టోర్నమెంట్ నిర్వహిస్తున్నారు. ఈ టోర్నమెంట్‌ను ఎమ్మెల్సీ, జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ చైర్మన్ ఇందుకూరి రఘురాజు మంగళవారం ఉదయం ప్రారంభించారు. శిక్షణ పొందుతున్న 105 మంది క్రీడాకారులను రఘురాజు పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులతో ఆయన మాట్లాడుతూ గెలుపు ఓటములు సమానంగా తీసుకోవాలని, క్రీడా స్ఫూర్తిని పాటించాలని సూచించారు. చదువుతో పాటు క్రీడల్లో రాణించే వారికి మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. కోచ్ శ్రీరాములు మాట్లాడుతూ బాలురు, బాలికలకు వేరువేరుగా రోప్ టాస్, సబ్ జూనియర్, జూనియర్,సీనియర్, సూపర్ సీనియర్ విభాగాలుగా విభజించి మూడు రోజుల పాటు సింగిల్స్, డబుల్స్ పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 31వ తేదీన విజేతలకు బహుమతులు అందజేస్తామని చెప్పారు.

డీఆర్ఎంకు వినతిపత్రం అందజేత

• ఆదుకోవాలంటూ చిరు వ్యాపారుల విజ్ఞప్తి



డివిజనల్ రైల్వే మేనేజర్‌ను కలిసిన గరివిడి వ్యాపారస్తులు

చీపురుపల్లి రూరల్(గరివిడి): ఎన్నో ఏళ్లుగా రైల్వే స్థలంలోనే చిన్నపాటి దుకాణాలు ఏర్పాటు చేసుకుని కుటుంబాలతో జీవనం సాగిస్తున్నాం. ఉన్నట్లుండి దుకాణాలు తొలగిస్తే మా కుటుంబాలు రోడ్డున పడతాయి. తమను ఆదుకోవాలంటూ గరివిడి ఫేకర్‌రోడ్డులో గల వ్యాపారస్తులు మంగళవారం టీడీపీ నాయకుడు బలగం వెంకటరావుతో కలిసి విశాఖపట్నం రైల్వే డివిజన్ మేనేజర్ కార్యాలయంలో డీఆర్ఎంకు వినతిపత్రం అందజేశారు. ఇటీవల గరివిడి ఫేకర్‌రోడ్డులో రైల్వే స్థలంలో ఉన్న దుకాణాలను తొలగించాలంటూ రైల్వే అధికారులు నోటీసులు జారీ చేశారు. ఈ మేరకు స్థానిక వ్యాపారస్తులంతా విశాఖపట్నం డివిజనల్ రైల్వే మేనేజర్ కార్యాలయానికి వెళ్లి డీఆర్ఎంకు వినతిపత్రం అందజేశారు. గరివిడి రైల్వేస్థలంలో గడిచిన 40 నుంచి 45 ఏళ్లుగా చిన్నపాటి దుకాణాలు నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నామని, 200 కుటుంబాలు ఈ వ్యాపారాల మీదనే ఆధారపడి బతుకుతున్నామని తెలిపారు. సదరు స్థలానికి ప్రతి ఏడాది అద్దె చెల్లిస్తూ వ్యాపారం చేసుకుంటున్నామన్నారు. దుకాణాలు తొలగించాలంటూ రైల్వే అధికారులు నోటీసులు జారీచేశారని, ఈ దుకాణాలు కోల్పోతే తమ కుటుంబాలు రోడ్డున పడతాయని వాపోయారు. ఈ స్థలంలో భవిష్యత్తులో రైల్వేలైన్‌కు సంబంధించి ఎలాంటి నిర్మాణాలు జరిగినా తామంతా కలిసి స్వచ్ఛందగా స్థలాన్ని విడిచిపెట్టి రైల్వేకు అప్పగిస్తామని తెలియజేశారు.

జూన్ 3వ తేదీలోగా అడ్మిషన్లు పొందాలి



లక్కవరపుకోట: జమ్మాదేవిపేట గ్రామ సమీపంలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాల లో 2025–26 విద్యా సంవత్సరానికి 5వ తరగతిలో ప్రవేశాలకు నిర్వహించిన ప్రవేశ పరీక్షలో మెరిట్ సాధించిన వారి జాబితా ను ప్రిన్సిపాల్ యు.విజయ్‌కుమార్‌పాత్రో మంగళవారం విడుదల చేశారు. సంబంధిత జాబితా ను పాఠశాల నోటీస్ బోర్డులో అతికించడంతో పాటు సీట్లు వచ్చిన విద్యార్థినుల తల్లిదండ్రులకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు.సీట్లు వచ్చినవారు జూన్ 3వ తేదీలోగా అడ్మిషన్ పొందాలని ప్రిన్సిపాల్ సూచించారు. ప్రవేశాలకు విద్యార్థినులు దరఖాస్తుఫారం, ర్యాంకు కార్డు, టీసీ, స్టడీ సర్టిఫికెట్, జనన ధ్రువ పత్రం, తెలుపు రేషన్ కార్డు, ఫిజికల్ ఫిట్నెస్ సర్టిఫికెట్, విద్యార్థినితో పాటు తల్లిదండ్రులు పాస్ పోర్ట్ సైజ్ ఫొటోలు, బ్లడ్ గ్రూప్ వివరాలతో హాజరు కావాలని పేర్కొన్నారు.

అధ్వానంగా రహదారులు



రావివలస రోడ్డులో పడిన గుంతలు



గ్రామానికి ముందు పూర్తిగా ఊడిపోయిన రోడ్డు

చీపురుపల్లి: మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రహదారులు అధ్వానంగా ఉన్నాయి. దీంతో ఆయా రహదారులపై ప్రయాణించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని వారంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అందులో భాగంగానే చీపురుపల్లి మండలంలోని చీపురుపల్లి నుంచి రావివలస మీదుగా గురానపేట, కొత్తపేట, పైలపేట, ఆర్థివలస తదితర గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారి అధ్వానంగా తయారైంది. ఈ రోడ్డులో ఎక్కడిపడితే అక్కడే గోతులతో పాటు పలుచోట్ల పూర్తిగా బీటీ రోడ్డు ఊడిపోవడంతో అవస్థలు తప్పడం లేదు. పట్టణంలోని లావేరురోడ్ నుంచి రావివలస వెళ్లే మార్గంలో అదే పరిస్థితి నెలకొంది. ఈ రోడ్డులో రావివలస, ఆర్థివలస, పైలపేట, కొత్తపేట, గురానపేట తదితర గ్రామాలు ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. రాత్రి సమయాల్లో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు చెబుతున్నారు.

ప్రత్యేక అవసరాల పిల్లల గుర్తింపు సర్వే



వేపాడ అంగన్‌వాడీ కేంద్రంలో సర్వేను పరిశీలిస్తున్న ఎంఈఓ నాగభూషణం

వేపాడ: మండలంలోని పలు గ్రామాల్లో భవిత కేంద్రం ఉపాధ్యాయినులు ఎస్.సత్యవతి, సీహెచ్ జయంతి మంగళవారం బడి బయట ఉన్న ప్రత్యేక అవసరాల పిల్లల గుర్తింపు సర్వే నిర్వహించారు. మండల కేంద్రంలోని అంగన్‌వాడీ సెంటర్‌లో సర్వేను ఎంఈఓ నాగభూషణం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో జూన్ 9వ తేదీ వరకు ఈ సర్వే చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీస్కూల్ విద్యనభ్యసిస్తున్న ప్రత్యేక అవసరాల పిల్లలను గుర్తించడంతో పాటు ఇంటింట సర్వే చేయనున్నట్లు పేర్కొన్నారు. పాఠశాలలో దివ్యాంగ విద్యార్థుల సామర్థ్యానికి అనుగుణంగా బోధన అందిస్తున్నామని, పిల్లలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా రైలింగ్ ర్యాంపు, ఫ్రెండ్లీ టాయిలెంట్ లాంటి సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. ప్రత్యేక అవసరాల పిల్లలకు అవసరమైన ఉపకరణాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ప్రత్యేక అవసరాలు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు.

రోడ్డు దిగని ఆర్డీఓ..



రోడ్డుపైనే రైతులతో మాట్లాడుతున్న ఆర్డీఓ రామ్మోహనరావు

దత్తిరాజేరు: మండలంలోని గడసాం గ్రామంలోని అయ్యప్ప చెరువు ఆక్రమణలకు గురైందని కొద్దిరోజుల కిందట గ్రామ రైతులు కలెక్టరేట్‌లో జరిగిన పీజీఆర్ఎస్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు బొబ్బిలి ఆర్డీఓ రామ్మోహనరావు మంగళవారం విచారణకు వచ్చారు. ఆయన చెరువును చూసేందుకు వస్తారని రైతులు మధ్యాహ్నం ఒంటి గంట నుంచి చెరువు వద్ద వేచిచూశారు. అయితే, మూడు గంటల సమయంలో వచ్చిన ఆర్డీఓ కారుదిగకుండానే రోడ్డుపై కొందరు రైతులతో మాట్లాడి వెళ్లిపోవడంపై అసంతృప్తి వ్యక్తంచేశారు. ఫిర్యాదుదారులతో మాట్లాడకుండా, చెరువు ఆక్రమణలు పరిశీలించకుండా.. మళ్లీ వస్తానని చెప్పి వెళ్లిపోవడం సరికాదని మాజీ ఎంపీటీసీ సభ్యుడు నేతేటి వెంకటరమణ, గ్రామ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలి



మహంతి రమణ

బొండపల్లి: పార్టీలకు అతీతంగా, అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలని వైఎస్సార్‌సీపీ గజపతినగరం నియోజకవర్గం గ్రీవెన్స్‌సెల్ అధ్యక్షుడు మహంతి రమణ మంగళవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. సర్వర్ పనిచేయకపోవడంతో రేషన్ కార్డుల్లో మార్పులు చేర్పులకు ఆటంకం కలుగుతోందన్నారు. ఇళ్ల మంజూరులో వివక్ష చూపొద్దన్నారు. ఉపాధి హామీ వేతనదారుల బకాయిలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఘనంగా ఆలయ ప్రతిష్ఠోత్సవాలు



కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

వేపాడ: మండలంలోని బానాది గ్రామంలో పరదేశమ్మ ఆలయ ప్రతిష్ఠ మహోత్సవాలు ఘనంగా కొనసాగు తున్నాయి. మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఈ ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు మంగవారం ఉదయం గ్రామస్తులతో పురోహితులు మేడపాటి కిశోర్ శర్మ ప్రత్యేక పూజలు, సాయంత్రం మహిళలతో సామూహిక కుంకుమ పూజలు చేయించారు.బుధవారం అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

నిత్య యోగా సాధనతో ఆరోగ్యం



శృంగవరపుకోట: ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో యోగా చేస్తున్న వివిధ శాఖల ఉద్యోగులు



వేపాడ: వేపాడ హైస్కూల్ మైదానంలో యోగా చేస్తున్న వివిధ శాఖల ఉద్యోగులు



లక్కవరపుకోట: యోగా చేస్తున్న తహసీల్దార్ ప్రసాదరావు, సచివాలయ ఉద్యోగులు



గజపతినగరం: యోగా చేస్తున్న ఎంపీపీ జ్ఞానదీపిక, జెడ్పీటీసీ గారతవుడు, శిక్షకుడు ప్రభాకర్‌రావు



చీపురుపల్లిరూరల్(గరివిడి): బి.జె.పాలెంలో ర్యాలీ చేస్తున్న గోవిందరాజులు, విద్యార్థులు



గుర్ల: ఎంపీడీఓ కార్యాలయంలో యోగా చేస్తున్న జెడ్పీటీసీ అప్పలనాయుడు, సన్యాసినాయుడు, అధికారులు



కొత్తవలస: యోగా చేస్తున్న సచివాలయ ఉద్యోగులు



గంట్యాడ: కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీపీ హైమావతి

శృంగవరపుకోట: నిత్యం యోగా,ధ్యానం చేయడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చని, మానసిక ప్రశాంతత లభిస్తుందని స్థానిక మోక్ష విద్య యోగమందిర్ నిర్వాహకులు శీలా కోటేశ్వరరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎంపీడీఓ తీష్ నేతృత్వంలో యోగాంధ్ర కార్యక్రమాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో అయిదు రోజుల పాటు ఉచిత ధ్యాన, యోగా శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు. తొలిరోజు మండల స్థాయి అధికారులు, వివిధ శాఖల సిబ్బందితో మోక్షవిద్య యోగమందిర్ నిర్వాహకులు శీలా కోటేశ్వరరావు యోగా చేయించారు. వివిధ యోగాసనాలు, వాటి అభ్యసనం, వాటి వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఎమ్మెల్సీ రఘురాజు తదితరులు పాల్గొన్నారు.

వేపాడలో...

వేపాడ: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంపీడీఓ సీహెచ్.సూర్యనారాయణ ఆధ్వర్యంలో యోగాంధ్ర శిక్షణ తరగతులను మంగళవారం ప్రారంభించారు. వివిధ శాఖల, సచివాలయాల సిబ్బందికి యోగా గురువులు శిక్షణ ఇచ్చారు.

అవగాహన

చీపురుపల్లిరూరల్(గరివిడి): యోగాతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని మానవీయత స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు బి.వి. గోవిందరాజులు అన్నారు. గరివిడి మండలంలోని బి.జె.పాలెం గ్రామంలో మానవీయత సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులు, గ్రామ యువతకు యోగా ఆవశ్యకతపై మంగళవారం అవగాహన కల్పించారు. అనంతరం ర్యాలీ చేశారు.

యోగాతో మానసిక ఉల్లాసం

గుర్ల: ప్రతిరోజూ యోగా చేయడం వల్ల మానసిక ఉల్లాసం పెరుగుతుందని జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పొట్నూరు సన్యాసినాయుడు అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో అధికారులు, ప్రజాప్రతి నిధులు మంగళవారం యోగాసనాలు వేశారు.ఎంపీడీఓ శేషుబాబు, నేచురోపతి వైద్యాధికారిణి రజితా రాయ్, యోగా ఉపాధ్యాయులు గౌరి, భారతి, కరుణ పాల్గొన్నారు.

ఎల్.కోట, కొత్తవలసలో..

లక్కవరపుకోట/కొత్తవలస: ఎల్.కోట మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ ఆవరణలో యోగా శిక్షణ తరగతులను తహసీల్దార్ ప్రసాదరావు ఎంపీడీఓ ఎస్.అప్పరావు మంగళవారం ప్రారంభించారు. అలాగే కొత్తవలసలోని లలితా కన్వె న్షన్ హాల్‌లో యోగా శిక్షణ తరగతులను ఎంపీడీఓ ఎస్.రమణయ్య,తహసీల్దార్ బి.నీలకంఠరావు ప్రారంభించారు. ఆయా మండలాల అధికారులు, వివిధ శాఖల ఉద్యోగులు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

యోగా నేర్చుకోండి: ఆరోగ్యంగా జీవించండి

గజపతినగరం: సంతోషంగా,ఆనందంగా జీవించాలంటే ప్రతి ఒక్కరూ యోగా చేయాలని ఎంపీపీ బెల్లాన జ్ఞాన దీపిక అన్నారు. ఈ మేరకు మంగళవారం స్థానిక ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల క్రీడాప్రాంగణంలో ఎంపీడీఓ బి.కల్యాణి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన యోగాంధ్ర శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొని పలు సూచనలు సలహాలు ఇచ్చారు. అనంతరం యోగా శిక్షకుడు శుభాకర్ రాజు ప్రయోగాత్మకంగా పలు రకాల యోగాసనాలు చేస్తూ వారికి తర్ఫీదు ఇచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గారతవుడు, తుమికాపల్లి సర్పంచ్ బెల్లాన త్రినాథరావు, మండల పరిషత్ అధికారులు, పంచాయతీ ఈఓలు, సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు, ఆయుష్ డాక్టర్లు పాల్గొని పలు రకాల యోగాసనాలు వేశారు.

యోగాతో ఆరోగ్యం

గంట్యాడ: యోగాతో ఆరోగ్యం సిద్ధిస్తుందని ఎంపీపీ పీరుబండి హైమావతి అన్నారు. కొఠారుబిల్లి కూడలిలో ఉన్న టీటీడీ కల్యాణ మండపంలో మంగళవారం నిర్వహించిన యోగా టీఓటీల శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలని, ఒత్తిడికి దూరంగా జీవించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఆర్.వి.రమణమూర్తి, తహసీల్దార్ నీలకంఠేశ్వరరెడ్డి, ఎంఈఓ విజయకుమారి, సీడీపీఓ డి.ఉమాభారతి, పీరుబండి జైహింద్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.